ప్రజాశక్తి
గురువారం 17 ఆగస్టు 2023

నేడు భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-బలిజిపేట

భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు ఆ సంఘం నాయకులు చక్రధర్, కైలాస్ తెలిపారు. బుధవారం మండలంలోని చిలకలపల్లిలో ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, పిల్లలకు స్కాలర్‌షిప్ ఇప్పించాలని, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, పెండింగ్ క్లయిములు, ఇఎస్ఐ వంటి సమస్యల పరిష్కారం కెఓసం ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు శంకర్రావు, సంతు, శ్రీను, కాశి, తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థిని మనస్వినిని అభినందిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, డిఇఒ ప్రేమ్‌కుమార్

కెజిబివి విద్యార్థినికి అరుదైన అవకాశం

ఐక్యరాజ్యసమితి సదస్సులో ప్రసంగించనున్న మనస్విని

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని సామల మనస్వినికి అరుదైన అవకాశం లభించింది. అమెరికాలో నిర్వహించే ఐక్యరాజ్యసమితి సదస్సులో ఆమె పాల్గొని, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యావిధానం ద్వారా మన్యం జిల్లాలో విద్యార్థులు ఏ విధంగా లబ్ధిపొందవచ్చో ప్రసంగించనుంది. ఈ మేరకు కలెక్టరు నిశాంత్‌కుమార్ బుధవారం ఆ విద్యార్థి మనస్వినిని అభినందించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు అంతర్జాతీయ అంశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 10 మంది విద్యార్థులతో కూడిన ప్రతినిధి బృందాన్ని పంపాలని నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 105 మంది విద్యార్థులను రాత పరీక్ష కోసం గుర్తించగా, అందులో 30 మందిని వర్చువల్ స్పీకింగ్ టెస్ట్ కోసం గుర్తించి, వారిలో పది మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పది మంది విద్యార్థులను ఎంపిక చేయగా, ముఖ్యమంత్రి ప్రత్యేక సిఫార్సుతో 9వ తరగతి చదువుతున్న మనస్విని ఎంపిక చేసినట్లు వివరించారు. ఐరాస కేంద్ర కార్యాలయంలో సెప్టెంబరు 18, 19 తేదీలలో జనరల్ అసెంబ్లీ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధిపై ఉన్నత స్థాయి రాజకీయ ఫోరంలో పాల్గొంటారని, నాడు-నేడు (పాఠశాల విద్య) కార్యక్రమాలపై ప్రసంగిస్తారని తెలిపారు. సదస్సులో పాల్గొనడం ద్వారా జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డిఇఒ ప్రేమ్ కుమార్, బాలికల అభివృద్ధి అధికారి కె.రోజారమణ, ప్రిన్సిపల్ సిహెచ్. శ్రీరంజని, పిఇటి ఎన్.అరుణజ్యోతి పాల్గొన్నారు.

నత్తనడకన ఇ-క్రాప్

1.14లక్షల ఎకరాలకు 30శాతమే గుర్తింపు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో వ్యవసాయ పంటల ఇ-క్రాప్ బుకింగ్ నత్తనడకన సాగుతోంది. ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా వివిధ పంటలు ఇప్పటి వరకు సుమారు 1.14లక్షల ఎకరాల్లో సాగవ్వగా అందులో కేవలం 30శాతం పంటలకు మాత్రమే ఇ-క్రాప్ నమోదైంది. దీంతో, రైతుల్లో ఆందోళన వ్యక్తమౌతోంది. వ్యవసాయశాఖ అధికారులు మాత్రం సాంకేతిక కారణాలను సాకుగా చూపుతున్నారు.

ఇ -క్రాప్ బుకింగ్ ఆధారంగానే ప్రభుత్వం పంటల బీమా, సున్నావడ్డీ కల్పిస్తున్న విషయం విధితమే. ఉత్పత్తులను కొనుగోలుచేసి, వాటికి కనీస మద్దతు ధర కల్పించేందుకు కూడా ఇ-క్రాప్‌తోనే ప్రభుత్వం ముడిపెట్టింది. ఇ-క్రాప్ కింద గుర్తింపు పొందని రైతులు, ముఖ్యంగా ధాన్యం విక్రయంలో ఎన్ని ఇబ్బందులు ఎదర్కొన్నారో రైతాంగానికి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఈనేపథ్యంలో ఇ-క్రాప్ బుకింగ్ అనేది రైతులకు అత్యంత కీలకంగా మారింది. అమలు విషయంలో లక్ష్యానికి దూరంగా ఉండడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. మన జిల్లాలో ఖరీఫ్ సీజన్ అత్యంత ప్రాధాన్యతగలది. ఎక్కువ భూభాగంలో వర్షాధారంగానే పంటలు సాగవుతాయి కాబట్టి రబీలో పంటల నామమాత్రమే. ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు, నువ్వులు, రాగులు, చిరుధాన్యాలు తదితర పంటలు కలిపి సుమారు 4లక్షల ఎకరాల్లో సాగువుతాయి. ఇందులో అత్యధికంగా వరి 2,23,025 ఎకరాల్లో సాగవుతుంది. ఆ తరువాత స్థానంలో మొక్కజొన్న, పత్తి, చెరకుసాగు ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు 1,14,285 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా వరి 72,884 ఎకరాల్లో సాగైంది. ఇందులో ఇప్పటి వరకు కేవలం 16,832 ఎకరాలకు మాత్రమే ఇ-క్రాప్ నమోదైంది. మొక్కజొన్న 37,728 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, 19,156 ఎకరాల వరకు సాగైంది. ఇందులోనూ 1610 ఎకరాల మేర మాత్రమే ఇ-క్రాప్ బుకింగ్‌కు నోచుకుంది. పత్తిపంట విషయంలో మరీ దారుణంగా 2,938 ఎకరాలకు గాను 254 ఎకరాలను మాత్రమే గుర్తించారు. చెరకుసాగు సాగు పాత, కొత్త కలిపి 779 ఎకరాలు ఈ క్రాప్ కింద నమోదు చేశారు. నువ్వులు 2232 ఎకరాలు, రాగులు 101 ఎకరాల చొప్పున ఇ-క్రాప్ కింద చేర్చారు. ఈ నేపథ్యంలో రైతులు ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తుండగా, అధికార యంత్రాంగం సాంకేతిక సమస్యల వలే ఇ-క్రాప్ నెమ్మదిగా సాగుతోందని చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జులై 30 నుంచి ఇ -క్రాప్ నమోదు ప్రారంభమైంది. సెప్టెంబర్ 15లోపు పూర్తిచేయాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఇ-క్రాప్ నమోదులో భాగంగా సంబంధిత రైతుల ఫోటోలను పొలంలోనే తీసి అప్‌లోడ్ చేయాల్సివుంది. ఇకెవైసి కూడా తీసుకోవాలి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు వేలాది ఆర్‌బికెలు ఇదే పనిలో వుండడం వల్ల సర్వర్ సహకరించడం లేదని ఆయా సిబ్బంది వాదన. జిల్లాలో చిన్నచిన్న భూ కమతాలు కావడం వల్ల ఉత్తరాంధ్ర మినహా ఇతర జిల్లాలతో పోలిస్తే రైతుల పరిధిలోని సర్వే నెంబర్లు కూడా ఎక్కువగానే ఉన్నాయి. మన జిల్లా పరిధిలో సుమారు 30.16లక్షల సర్వే నెంబర్లు ఉన్నట్టు సమాచారం. సర్వే నెంబర్లు ఎక్కువగా ఉండడం వల్ల ఎంట్రీలకు కూడా ఎక్కువ సమయం పడుతుందని క్షేత్ర స్థాయి సిబ్బంది చెబుతున్నారు. ఏదేమైనా పంటలన్నీ సకాలంలో ఇ-క్రాప్ బుకింగ్ కాకపోతే రైతులకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉంటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది (ఫైల్)

ముఖ్యమంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం

పిటిజి ప్రిన్సిపల్‌కు అవార్డు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భద్రగిరి పిటిజి పాఠశాల ప్రిన్సిపల్ ఎన్.సుబ్రహ్మణ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అవార్డు అందజేశారు. ఈ ఏడాది నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, మార్కులలో మంచి ప్రతిభను కనబరిచారు. మరోవైపు ఇక్కడ చదువుతున్న విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలకు రావడం, హాజరు శాతం నూటికి నూరు శాతం కలిగి ఉంది. ఉపాధ్యాయులు ఉత్తమ బోధన, అన్ని కలిపి పాఠశాలను గుర్తించిన అధికారులు ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

పూర్ణపాడు-లాబేసు వంతెన కోసం

యుద్ధానికి సిద్ధం కండి

వంతెన సాధన కమిటీ పిలుపు • నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు

గ్రామాల్లో ప్రచారం చేస్తున్న వంతెన సాధన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-కొమరాడ

దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు - లాబేసు వంతెన పూర్తికి యుద్ధానికి సిద్ధం కావాలని వంతెన సాధన కమిటీ సభ్యులు వి.ఇందిర, కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం నాగావళి అవతల గ్రామాలైన కొట్టు, తొడుము, రాయపురం, తులసవలస, కెమిశీల, దిగువ గుణద, తదితర గ్రామాల్లో వంతెన సాధన కమిటీ, ఎపి రైతుసంఘం, వ్యకాస ఆధ్వర్యాన ప్రచారం చేశారు. గురువారం నుంచి చేపట్టే రిలే నిరాహార దీక్షలను మద్దతివ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఇందిర, సాంబమూర్తి మాట్లాడుతూ వంతెన పనులు ప్రారంభించి పాలకుల నిర్లక్ష్యంతో 14 ఏళ్లుగా సాగదీస్తున్నారని విమర్శించారు. కొమరాడ మండలంలో 31 పంచాయతీలకు గాను తొమ్మిది పంచాయతీల గిరిజనులు మండల కేంద్రానికి రావాలంటే ప్రాణాలు ఫణంగా పెట్టాల్సిన పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తంచేశారు. 1996లో వనిజ గ్రామం వద్ద నాగావళి నదిలో నాటు పడవ ప్రమాదంలో 36 మంది గిరిజనులు మృతిచెందారని గుర్తుచేశారు. ఇలాంటి సంఘటన జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. రూ.14 కోట్లు విడుదల చేసి, కాంట్రాక్టరును రప్పించి, వంతెన పెండింగ్ పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. అందుకోసం గురువారం నుంచి ఈ నెల 26 వరకు మండలంలోని కోమట్లపేట గ్రామం వద్ద రిలే నిరాహార దీక్షలు, 28న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా, ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపి రైతుసంఘం నాయకులు ఉపేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివున్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పులి అడుగుజాడలను పరిశీలిస్తున్న బీట్ అధికారి దాలినాయుడు, కొరమ సమీపంలో పులి పాదముద్రలు

మన్యంలో పులి సంచారం

భయాందోళన చెందుతున్న గిరిజనులు

ప్రజాశక్తి-సీతంపేట

ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో ఏనుగులతో సతమతమవుతున్న ఆదివాసీలను మరో భయం పట్టుకుంది. బుధవారం దోనుబాయి సమీపంలో పెద్దపులి సంచరించింది. పుబ్బాడ, శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం బడిగం మీదుగా కొరమ వైపు పులి వెళ్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఇప్పటికే దోనుబాయి గుగ్గిలం తోటలో పెద్దపులి అడుగు జాడలను పరిశీలించారు. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు బిక్కుబిక్కుమంటున్నారు.

భామిని : మండలంలోని కొరమ గ్రామ సమీపంలోని క్వారీ పరిసరాలలో పులి అడుగుజాడలు స్థానికులను కలవర పెడుతున్నాయి. స్థానిక క్వారీలో ఉండే వాచ్‌మెన్ బుధవారం తెల్లవారుజామున పులి సంచరించినట్లు కనిపించిందని, భయంతో పూర్తి స్థాయిలో ఆ జంతువును పరిశీలించలేదని తెలిపాడు. అటవీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించగా పులి అడుగుజాడలుగా తెలియజేశారు. వెంటనే సమాచారాన్ని తహశీల్దార్ ఎన్.అప్పారావుకు తెలియజేయడంతో కొరమ పరిసర గ్రామాలలో టామ్ టామ్ వేసి, ప్రజలను అప్రమత్తం చేశారు. క్వారీ పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జగనన్న కాలనీలను

ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేసి, జగనన్న కాలనీలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. పార్వతీపురం పట్టణ పరిధిలోని కృష్ణపల్లిలో ఉన్న జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. లేఅవుట్‌లో మౌలిక సదుపాయాల పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులకు ఆర్థిక సహాయంతోపాటు సబ్సిడీ ధరలతో మెటీరియల్ అందిస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇంటి నిర్మాణ పనులను పూర్తిచేయాలని తెలిపారు. లేఅవుట్‌లో కరెంటు, నీటి సరఫరా, ఆర్చి నిర్మాణం, మురుగునీటి కాలువల పనులు వెంటనే పూర్తిచేయాలన్నారు. చేసిన పనులకు బిల్లులను వెంటనే సమర్పించాలని తెలిపారు.

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఆర్.గోవిందరావు, ఆర్‌డిఒ కె.హేమలత, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎం.వి.ఆర్.కృష్ణాజి, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనరు జె.రామ అప్పలనాయుడు, విద్యుత్తు, గృహనిర్మాణ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిడిఎంహెచ్‌ఒ పోస్టు భర్తీచేయాలి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

డిప్యూటీ డిఎంహెచ్‌ఒ పోస్టును భర్తీ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మామిడిపల్లిలోని సిఐటియు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 2022 డిసెంబరు నుంచి రెగ్యులర్ డిప్యూటీ డిఎంహెచ్‌ఒను భర్తీ చేయలేదని, ఇన్‌ఛార్జులతోనే నెట్టుకొస్తున్నారని చెప్పారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని గిరిజనులు ఆరోగ్యపరమైన సమస్యలను పర్యవేక్షించే అధికారి పూర్తిస్థాయిలో లేకపోవడం వల్ల సక్రమంగా వైద్య సేవలు అందడం లేదని చెప్పారు. ప్రస్తుతం విష జ్వరాలు, అనారోగ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, ఈ సమస్యల పరిష్కారానికి, వైద్యాధికారులను సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లడానికి పూర్తిస్థాయిలో ఉపవైద్యాధికారి అవసరమని చెప్పారు. దీనిపై డిప్యూటీ సిఎం రాజన్నదొర, కలెక్టర్, ఐటిడిఎ పిఒలు వెంటనే స్పందించి రెగ్యులర్ డిప్యూటీ డిఎంహెచ్‌ఒను నియమించాలని డిమాండ్ చేశారు. మందుల కొరత తీర్చాలని, నిర్మాణాల్లో ఉన్న భవనాలను వెంటనే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తెచ్చేలా జిల్లా అధికారులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు మండల నాయకులు జరజాపు జ్యోతీశ్వరరావు, జె.వినయ్, విజయ్, రమేష్, అప్పలరాజు పాల్గొన్నారు.

వాలంటీర్‌పై విచారణ

ప్రజాశక్తి-పాలకొండ

నగర పంచాయతీ పరిధిలో భాసురువారివీధి సచివాలయంలో వాలంటీర్ గొరిల్లా సాయికృష్ణపై మురళీకృష్ణ ఇటీవలే జగనన్నకు చెబుదాంకు ఫిర్యాదు చేశారు. దీంతో డిఎల్‌డిఒ వి.వి.గోపాలకృష్ణ బుధవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారునితోపాటు వాలంటీర్‌తో మాట్లాడారు. లిఖిత పూర్వకంగా వివరాలు సేకరించారు. వాలంటీర్‌కు మెమో ఇవ్వాలని అడ్మిన్ కార్యదర్శి శివకృష్ణను ఆదేశించారు.

విచారణ చేపడుతున్న డిఎల్‌డిఒ గోపాలకృష్ణ

అంగన్వాడీల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-పాలకొండ

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వి.కళావతికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ మాదిరిగా వేతనాలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అందించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు, వేతనంలో సగం పింఛను ఇవ్వాలని, అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమప్రభ, జిల్లా కోశాధికారి బి.అమరవేణి, నాయకులు జి.జెస్సిబాయి, ఎ.పార్వతి, కె.అరుణ, ఆర్.భవాని పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకి వినతి పత్రం అందిస్తున్న అంగన్వాడీలు

వైసిపి హయాంలో జీవనం దుర్భరం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ప్రజాశక్తి-పాచిపెంట

ప్రస్తుత వైసిపి పాలనలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయని, ప్రజల జీవనం దుర్భరంగా మారిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. పాచిపెంట మండల కేంద్రంలో బుధవారం టిడిపి మండల అధ్యక్షులు ఎన్నింటి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే యువత, మహిళలు, పేదలకు అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో టిడిపి మేనిఫెస్టోలో అనేక సంక్షేమ పథకాలు పొందుపరిచిందని వివరించారు. అనంతరం గ్రామంలో ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.పి.భంజ్‌దేవ్, నాయకులు పిన్నింటి ఈశ్వరరావు, ముఖి సూర్యనారాయణ, మంచాల పారమ్మ, యుగంధర్, గ్రామ సర్పంచ్ సంతోషిని, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహాశక్తి ర్యాలీలో పాల్గొన్న సంధ్యారాణి, టిడిపి నాయకులు, మహిళలు

18న విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కురుపాం

ఈ నెల 18న కురుపాం సెక్షన్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఫోరం చైర్మన్ బి.సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇఇ వి.వి.కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం ఐటిడిఎ సబ్‌డివిజన్ పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించుకోవడంతోపాటు తగు సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలోని నిమ్మలపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని బుధవారం సర్పంచ్ గుండ్రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యాన డిపిఎం పి.షణ్ముఖరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించే పంటలకు అవసరమైన ఉత్పాదకాలు, సేంద్రియ ఎరువులు, జీవామృతాలు, రంగు పల్లాలు, నవధాన్యాలు, కషాయాలు, ద్రావణాలు రైతులకు లభ్యమవుతాయని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా వనరుల కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించాలని కోరారు. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించుకోవాలని సూచించారు. ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో వర్షాలు అనుకూలంగా ఉండడం వల్ల పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ నిర్మలాదేవి, నరసింహ, మండల ఇన్‌ఛార్జి ఎస్.ప్రసాద్, బి.ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు పూర్తయ్యేది ఎప్పుడు?

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి విస్తరణ పనులు ఎప్పుడు పూర్తిచేస్తారని జనసేన నాయకులు ఎం.పుండరీకం, కె.పవన్ సాయి ప్రశ్నించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండేళ్ల గడిచినా రోడ్డు పనులు పూర్తిచేయక పోవడం దారుణమన్నారు. ప్రస్తుతం రహదారిపై రాళ్లు తేలడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. గృహాలు తొలగించిన వారికి పరిహారం చెల్లించలేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వజ్రగడ రవికుమార్, సీనియర్ నాయకులు కోడి వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌లో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి- డెంకాడ

కెమికల్ ఇంజనీరింగ్‌లో మంచి ఉపాధి అవకాశాలున్నాయని షెల్ ఇంటర్నేషనల్ రిటైర్డ్ కెమికల్ ప్రాసెస్ సెఫ్టీ సలహాదారుడు ఎన్.సీతారాం అన్నారు. చింతలవలసలోని మహారాజ ఇంజనీరింగ్ కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంటులో జరుగుతున్న ఎక్స్‌పర్ట్ అడ్వైజర్ లెక్చర్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిశ్రమల భద్రత, కెమికల్ ఇంజనీరింగ్ ప్రాముఖ్యత అనే అంశాలపై వివరించారు. పర్యావరణం, ఇంధన పొదుపు, కాలుష్య నివారణ గురించి అవగాహన కలిగించారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకోసం భద్రతను పాటించవలసిన ప్రాముఖ్యతను తెలియజేశారు. కెమికల్ ఇంజనీరింగ్‌లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని హెచ్‌పిసిఎల్, కోరమాండల్ ఫెర్టిలైజర్స్, ఎన్ఎఫ్‌సిఎల్, అరబిందో, రెడ్డీస్, మైలాన్, రిలయన్స్, హల్దియా రిఫైనరీ, ఎన్ఎస్‌టిఎల్, బార్క్, స్టీల్ ప్లాంట్, ఒఎన్‌జిసి, గైల్ వంటి కంపెనీలలో ఎంవిజిఆర్ విద్యార్థులు 80 శాతం మంది ఉపాధి అవకాశాలు పొందుతున్నారని వారికి మంచి జీతాలు, మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కళాశాల డైరెక్టర్, ప్రొఫెసర్ పి.సీతారామ రాజు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్. రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి. సర్వారావు, అధ్యాపకలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్వర పీడితుల నమూనాలు సేకరించండి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని గుల్లపాడు గ్రామంలో మలేరియా జ్వరాలతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు బాధపడగా అందులో ఈశ్వరమ్మ అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. భార్య మృతి చెందగా భర్త నాగరాజు, కుమారుడు శేఖర్ విశాఖ, రాజాం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో డిఎంఅండ్‌హెచ్ఒ భాస్కరరావు బుధవారం గ్రామంలో పర్యటించారు. ఇంటింటా జ్వర పీడితుల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించాలని రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అసిరి నాయుడుకు సూచించారు. ఈ మేరకు బుధవారం ప్రజాశక్తిలో గుల్లపాడులో పడగ విప్పిన మలేరియా అనే కథనానికి స్పందించి జ్వరంతో మృతి చెందిన కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఇంటింటికి జ్వరాల సర్వేను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బందికు పారిశుధ్యం మెరుగు పరచాలని, దోమల నివారణకు ఫాగింగ్ యంత్రంతో పొగ, మలాథియన్ స్ప్రే చేయాలని సూచించారు. అప్రమత్తంగా ఉంటేనే జ్వరాలు నివారించవచ్చునన్నారు.

వాసిరెడ్డి కృషితోనే సాగునీటి ప్రాజెక్టులు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఉత్తరాంధ్రలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి మాజీమంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు కృషితోనే జరిగిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మాజీమంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు 101వ జయంతి బుధవారం నిర్వహించారు. రైల్వే జంక్షన్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శంబంగి మాట్లాడుతూ కృష్ణమూర్తినాయుడు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. బొబ్బిలిలో ఇరిగేషన్, విద్యుత్ శాఖ కార్యాలయాలు ఏర్పాటుకు పని చేశారన్నారు. బొబ్బిలి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు వెంగళ రాయ సాగర్ ప్రాజెక్టు నిర్మించారని చెప్పారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, కొప్పుల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, వాసిరెడ్డి తాతజీ నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు వంగపండు శ్రీరాములు నాయుడు, కో ఆప్షన్ సభ్యుడు తెర్లీ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పిసిసి మెంబర్ మువ్వల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాజీ మంత్రి, కీర్తి శేషులు వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వి.లక్ష్మినాయుడు, సామాజిక కార్యకర్త పల్నాటి ఈశ్వరరావు, యువజన నాయకులు మండపాక శ్రీనివాసరావు, కార్యకర్తలు షర్లా పాపారావు, కృష్ణ మోహన్ రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి గౌతు లచ్చన్న

ప్రజాశక్తి - గరుగుబిల్లి

జీవితాంతం బలహీన వర్గాల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన సర్దార్ గౌతు లచ్చన్న పేదల ఆశాజ్యోతి అని టిడిపి మండల అధ్యక్షులు అక్కేన మధుసూధనరావు కొనియాడారు. సర్దార్ గౌతు లచ్చన్న 114వ జయంతి సందర్భంగా తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ వద్ద ఉన్న లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి గౌతు లచ్చన్న అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మరడాన తవిటి నాయుడు, తెలుగుయువత మండల అధ్యక్షులు బొత్స జగదీష్, ఎం.నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ఆన్‌లైన్ వేగవంతం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఓటర్ల జాబితా ఆన్ లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. నూకరాజు సూచిం చారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాల యంలో కొత్త ఓటర్ల నమోదు, జాబితా సవరణలపై రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు చేసిన నూతన ఓటర్ల నమోదు, జాబితా సవరణలు ఆన్ లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా బూత్ స్థాయి అధికార్ల నూతన ఓటర్ల నమోదు, జాబితా సవరణలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మండలంలోని సెయింట్ డొమినిక్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖాధికారి జామి సర్వేశ్వరరావు ఆధ్వర్యాన సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల్లో రకాలు, అగ్నిమాపక పరికరాలను ప్రదర్శించి వివరించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎకనామిక్స్ లెక్చరర్ తెర్లి రవికుమార్ ఎకనామిక్స్ స్టడీ మెటీరియల్‌లను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డివిజిఎస్ త్రినాథరావు పాల్గొన్నారు.

170 కోట్లతో సంక్షేమ పథకాలు

'గడపగడపకు..'లో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి- పాచిపెంట

నాలుగున్నరేళ్ల వైసిపి హయాంలో పాచిపెంట మండలంలో 45,768 మంది లబ్ధిదారులకు 170.35 కోట్ల రూపాయలు పలు సంక్షేమ పథకాల ద్వారా అందించామని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర తెలిపారు. మండలంలోని కొటికిపెంట పంచాయతీ కొత్తవలస గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. అయినా, ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేయడం శోచనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా డబ్బులు ఇచ్చిన వారికే పథకాలు అందజేసేవారని, రాష్ట్రంలో చేసిన అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల్లో సాలూరుకు అత్యధిక నిధులు మంజూరు చేసి, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని తెలిపారు. గడపగడపకు కార్యక్రమం ద్వారా ఎన్నో సమస్యలు పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, డోల బాబ్జి, సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, టి.గౌరీశ్వరరావు, జి. వంంతా్యలనాయంండం, చంద్రునాయుడు, మధుసూదన్‌రావు, ఎంపిడిఒ జి.పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట.. గిరిజన మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వి.కళావతి

పాచిపెంట.. కేకు కట్ చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సీతంపేట : మండలంలోని పెద్దపొల్ల సచివాలయ పరిధిలోని మర్రిమానుగూడ, గడిగుజ్జి, సీడిమనుగూడ, చాపరాయిగూడ, వెలగాపురం, నాయికమ్మగూడ, చిన్నపొల్ల, పెద్దపొల్ల, పొల్లకాలనీ, కొత్తవలస, ఉమ్మ గెడ్డ గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వి.కళావతి చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ ఒక వైపు సంక్షేమ పథకాలతో, మరో వైపు అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజా రంజక పరిపాలన సాగిస్తున్నట్లు తెలిపారు. గత టిడిపి రాక్షస పాలనలో ప్రభుత్వ సేవల విషయంలో ఎటువంటి అవసరాలున్నా ప్రజలను లంచాలతో జన్మభూమి కమిటీలు పట్టి పీడించేవన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు తెలుసుకుని, తక్షణమే పరిష్కరించారు.

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి-సీతానగరం

రానున్న సాధారణ ఎన్నికలలో టిడిపి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేయాలని మాజీ ఎమ్మెల్సీ దారపురెడ్డి జగదీష్ అన్నారు. మండలంలోని రామవరంలో మహిళా శక్తి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన పోవాలన్నారు. సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం కొత్తగా నియమితులైన పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.విజయ్ చంద్రను పరిచయం చేశారు. అనంతరం విజయ్‌చంద్ర మాట్లాడుతూ నియోజకవర్గంలో కార్యకర్తలు అందరూ పార్టీ కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు కొల్లు తిరుపతిరావు నాయుడు, రౌతు వేణుగోపాలనాయుడు, నాయకులు కె.వెంకట నాయుడు, శ్రీదేవి, రామవరం సర్పంచ్ పెంట సత్యనారాయణ, ఎస్.హరిగోపాలరావు, శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, బి.సూర్యనారాయణ, పారినాయుడు పాల్గొన్నారు.

సీతంపేట.. మహాశక్తి కార్యక్రమంలో మాట్లాడుతున్న టిడిపి నాయకురాలు భూదేవి

సీతానగరం.. మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయ్‌చంద్ర

మహాశక్తితో మహిళల అభివృద్ధి

సీతంపేట : టిడిపి ప్రకటించిన మహాశక్తి పథకంతో మహిళలు అభివృద్ధి చెందుతారని టిడిపి నాయకులు పడాల భూదేవి అన్నారు. బుధవారం మండలంలోని పెదరామలో మహాశక్తి కార్యక్రమాన్ని పడాల భూదేవి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలనుద్దేశించి ఆమె మాట్లాడుతూ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలలో మహాశక్తి గూర్చి మహిళలు తెలుసుకోవాలన్నారు. మహిళలకు మరెన్నో ప్రయోజనాలు, రక్షణ వంటివి టిడిపితోనే సాధ్యమన్నారు. మహిళలంతా టిడిపికి అండగా ఉండాలని కోరారు.

ఓటరు సర్వే వేగవంతం

ప్రజాశక్తి-సీతంపేట

ఓటరు సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం పాలకొండ నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఓటర్ల సర్వేను వేగవంతం చేసేలా బిఎల్ఒలకు ఆదేశాలు ఇస్తామన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు, మరణించిన వారి పేర్లు తొలగించడం, పోలింగ్ బూత్‌లను సరిచేయడం, వేరే రాష్ట్రాలకు చెందిన వారి ఓట్లు తొలగించడం వంటివి చేసేటప్పుడు నిబంధనల ప్రకారం పూర్తిచేస్తామని అన్నారు. రాజకీయ పార్టీలు చెప్పిన అంశాలను పరిశీలిస్తామన్నారు. కొత్త పంచాయతీలకు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. బోగస్ ఓట్లు తొలగిస్తామన్నారు. ఒకే ఇంటి నంబర్ మీద ఎక్కువ ఓట్లు ఉన్న అంశాన్ని పరిశీలించి వాటిని కూడా తొలగిస్తామని తెలిపారు. సరిగా కనిపించని ఓటర్ల ఫొటోలను కూడా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు నరసింహమూర్తి, డిటిలు, నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

లక్ష్యంతో ముందుకెళ్తేనే ఫలితాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మాట్లాడుతున్న సిఐ సత్యనారాయణ

డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు పూర్తి చేసుకోవాలని ఎల్విన్‌పేట సిఐ బి.సత్యనారాయణ సూచించారు. స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫేర్వెల్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు డిగ్రీ విద్య ఒక కీలకదశని, ఈ సమయంలోనే విద్యార్థులు సరైన మార్గాన్ని ఎంచుకొని, తమ జీవిత లక్ష్యాలను చేరుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించాలని కోరారు. ఆధునిక సాంకేతిక యుగంలో విద్యార్థులకు ఎన్నో మార్గాల ద్వారా ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. దాన్ని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు కృషి చేయాలని కోరారు. అనంతరం ఎస్ఐ షణ్ముఖరావు మాట్లాడుతూ సెల్‌ఫోన్ కారణంగా విద్యార్థులు చాలా సమయాన్ని వృథా చేస్తున్నారని తెలిపారు. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది సైబర్ నేరగాళ్ళు విద్యార్థులను మోసం చేసే పరిస్థితులు ఎదురవుతున్నాయని చెప్పారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండి సెల్‌ఫోన్‌ను పాజిటివ్‌గా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీవరం, వైశ్య సంఘం అధ్యక్షులు జి.హరిప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ రామయ్య, ఎన్ఎస్ఎస్ పిఒ త్రినాధరావు పాల్గొన్నారు.

ఆశావహులతో మాట్లాడుతున్న కిశోర్ చంద్రదేవ్

కిశోర్‌ను కలిసిన ఆశావహులు

ప్రజాశక్తి - కురుపాం

కేంద్ర మాజీమంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్‌ని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తి లక్ష్మణరావు, కురుపాం నియోజకవర్గ టిడిపి టిక్కెట్ ఆశావహులు కురుపాంలో ఆయన కోట వద్ద బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో టిడిపి పరిస్థితులను, పార్టీ బలోపేతానికి చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం 2024 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా కష్టపడి కలిసికట్టుగా పనిచేయాలని కిశోర్ తెలిపారు. ఆ దిశగా అందరూ బాధ్యత తీసుకోవాలని ఆశావహులకు సూచించారు. కార్యక్రమంలో ఆశావహులు పి.లావణ్య, బిడ్డిక పద్మావతి, బిడ్డిక తమ్మయ్య, ఆర్ఎస్ఎస్ విజయ్‌కుమార్, భూపతిదొర, టిడిపి సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, జివి రమణమూర్తి, బండి రాజు, యువ నాయకులు చందక రామకృష్ణ, సువ్వాన గోవింద పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని ఉమారామలింగేశ్వర విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.బ్రహ్మాజీ, చింతాడ తవిటాచారి తెలిపారు. మండల కేంద్రంలో ఆ సంఘం మండల సర్వసభ్య సమావేశాన్ని గౌరవాధ్యక్షులు కె.తిరుపతి ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో సంఘం నాయకులు అంపిలి శ్రీను, అజ్జరాపు కాశీవిశ్వనాథం, భోగి తిరుపతిరావు, అంపిలి పార్వతీశం, భోగి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు వృద్ధుల తరలింపు

ప్రజాశక్తి-కురుపాం

కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో కంటి వెలుగు వైద్య శిబిరాల్లో శస్త్రచికిత్సలకు ఎంపిక చేసిన వారిని బుధవారం విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి మాట్లాడుతూ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్లద్దాలు, మందులు పంపిణీ చేస్తూ రోగులకు సక్రమంగా చూసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు శైలజ, రోజా, మల్లిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న బిఎస్ఎఫ్ సిబ్బంది

బిఎస్ఎఫ్ జవానుకు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని చినబోగిలిగ్రామానికి చెందిన బిఎస్ఎఫ్ హవల్దార్ నగర ప్రసాద్ (44) అనారోగ్యంతో మంగళవారం విశాఖలోని ఆస్పత్రిలో మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని మంగళవారం స్వగ్రామమైన చినభోగిలికి తీసుకురాగా, బుధవారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. బిఎస్ఎఫ్ సిబ్బంది, స్థానిక అధికారులు, గ్రామస్తులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. ప్రసాద్ గుజరాత్‌లోని గాండీధాంలో పనిచేస్తున్నారు. 23 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ప్రసాద్ సెలవుపై గత నెల 30న ఇంటికి వచ్చారు. ప్రసాద్‌కు భార్య పవిత్ర, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.వి.రమణ, ఎస్ఐ నీలకంఠం, ఆర్ఐ శ్రీనివాసరావు, సర్పంచ్ కె.రాధ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు టేకు దుంగలకు వేలం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో జగన్నాథపురంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద తుపాను కారణంగా పడిపోయిన టేకు చెట్టు దుంగలకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వేలం నిర్వహిస్తున్నారు. కమిషనర్ రామ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ చేపడుతున్నారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. బుధవారం వెంకంపేట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలో నెలకు రెండు సార్లు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. గ్రామంలో వృద్ధుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు.

పనస నందివాడలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని పనస నందివాడ గ్రామంలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మానస.. రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎఎన్ఎం బివి రవణమ్మ, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పెదపెంకిలో కంటి వైద్య శిబిరం

బలిజిపేట : మండలంలోని పెదపెంకిలో బుధవారం నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో 40 మందికి జెమ్స్ ఆస్పత్రి వైద్యులు శ్రావణి, నీరజ కంటి పరీక్షలు చేశారు. ఇందులో 14 మందిని నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. అనంతరం బిపి, షుగర్ టెస్టులను వైద్యులు పార్వతి చేసి, మందులు అందజేశారు.

రెండు బైకులు ఢీ

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని మక్కువ-దుగ్గేరు రహదారిలో బుధవారం సాయంత్రం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కొండబుచ్చంపేట నుండి శంబర వెళ్తున్న బోను లోకేష్ , మక్కువ నుండి శంబర వస్తున్న నైదాన సాయికృష్ణ రహదారిలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారని తెలియడంతో దుగ్గేరు రహదారి మీదుగా మరో మార్గంలో శంబర వస్తున్నారు. ఇద్దరు ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చి మక్కువ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించాలని సిబ్బంది సూచించారు. క్షతగాత్రులు ఇద్దరిదీ ఒకే గ్రామం. పోలీసులు దర్యాప్తు లో మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

బహిరంగ ప్రకటన
మహారాజశ్రీ పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జికోర్టు
SOP.NO. 02/2023

Between:
1. కూరంగి కోటేశ్వరరావు
2. కూరంగి ఆదినారాయణ
3. కొండగొట్టి రత్నాలమ్మ
4. కూరంగి బారికి ....పిటీషనర్స్ 1 to 4
And :
Nil ......రెస్పాండెంట్

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా పైన పేర్కొన్న కూరంగి కోటేశ్వరరావు S/o లేటు సూరయ్య అనువారిలో 1,2,4 పిటిషనర్స్ శ్రీ లేటు బాబూరావుకు అన్నదమ్ములు, మరియు 3వ పిటిషనర్ అక్క అయి యున్నారు. శ్రీ లేటు కూరంగి బాబూరావు అవివాహితుడు మరియు మరణించిన వ్యక్తి DRDA, పార్వతీపురంలో VELUGU ప్రాజెక్టులో CC గా చేసియుండెను. పైన పేర్కొన్న పిటీషనర్స్ 1 నుండి 4 చనిపోయిన బాబూరావు యొక్క PF మరియు ఇతర క్లయిమ్‌లు చేయుటకు హక్కు, అనుభవ వారసత్వ అసాములు అయినందున పైన పేర్కొన్న పిటీషనర్స్ శ్రీ పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో చట్టరీత్యా వారసత్వ హక్కు దాఖలు పడుటకు "Succession Certificate" నిమిత్తము పిటిషన్ వేసియున్నారు. వారు మాత్రమే చనిపోయిన వ్యక్తికి వారసత్వ వారసలు మరియు ఇతరులు ఎవరూ లేరు. తే 31-08-2023దిన పై కోర్టులో వాయిదా యున్నది. కావున కూరంగి కోటేశ్వరరావు మరియు ముగ్గురు పిటిషనర్ వారసత్వ హక్కు ధృవపత్రమునకు అర్హులు. కావున "Succession Certificate" జారీ చేయు నిమిత్తము ఎవరికైనా అభ్యంతరములు ఉన్నచో పైతేదిన కోర్టుకు హాజరై అభ్యంతరములు తెలియజేయవచ్చును.

ఇట్లు
కోలా రాజశేఖర్
అడ్వకేట్, పార్వతీపురం,
సెల్ నెం.9440081700